సాక్షి తిరుపతి

సోమవారం । 28 । అక్టోబర్ । 2024



లోక కల్యాణార్థమే..

లోక కల్యాణార్థమే శ్రీరామ యంత్ర రథయాత్ర చేపట్టినట్లు కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి తెలిపారు.

- 8లో



సత్యవేడు సర్కిల్‌లో వసూల్‌రాజా

సత్యవేడు సర్కిల్ పరిధిలో ఓ పోలీస్ అధికారి ఇష్టారాజ్యంగా వసూళ్లకు పాల్పడుతున్నారు. వాటాలు సైతం పంచుతున్నారు.

- 8లో



బతుకు 'వేట'లో గిరిజనం

పులికాట్‌లో నీరు చేరడంతో గిరిజన జాలర్లు చేపల వేటలో నిమగ్నమయ్యారు. మత్స్య సంపదను విక్రయించుకుంటున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

పవిత్రోత్సవాలకు అంకురార్పణ



అంకురార్పణ నిర్వహిస్తున్న అర్చకులు

చంద్రగిరి : శ్రీనివాస మంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వెంకటేశ్వర స్వామి వారి పవిత్రోత్సవాలకు ఆదివారం శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఉదయం స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, తోమాల, కొలువు, పంచాంగశ్రవణం, సహస్రనామార్చన నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు మృత్సంగ్రహణం, సేనాధిపతి ఉత్సవం పూర్తి చేసి, కనులపండువగా అంకురార్పణ జరిపించారు. కార్యక్రమంలో ఆలయ స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్ కుమార్, ఆర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్ పాల్గొన్నారు.

నేడు పవిత్ర ప్రతిష్ఠ

సోమవారం పవిత్రోత్సవాల్లో భాగంగా దేవదేవేరులకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. వైదిక కార్యక్రమాల అనంతరం పవిత్ర ప్రతిష్ఠ చేపట్టనున్నారు.

స్టడీ సెంటర్ ప్రారంభం



స్టడీ సెంటర్ ప్రారంభిస్తున్న భూమన, ఎమ్మెల్సీ సిపాయి

తిరుపతి మంగళం : తిరుపతి ఎమ్మార్‌పల్లె వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్టడీసెంటర్‌ను వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్ తిరుపతి మునిరామిరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు చక్కగా చదువుకునేందుకు వీలుగా అన్ని వసతులతో స్టడీసెంటర్ ఏర్పాటు చేశారన్నారు. ప్రజాసేవతో పాటు విద్యార్థుల ఉన్నతి కోసం స్టడీసెంటర్ నెలకొల్పిన మునిరామిరెడ్డిని అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు ఖాళీగా ఉన్నాయి. శనివారం అర్ధరాత్రి వరకు 77,84 మంది స్వామిని దర్శించుకున్నారు. 27,418 మంది తలనీలాలు సమర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.27 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 8 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లున్న వారికి 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.





ఎస్వీ బధిర జూనియర్ కళాశాలలో విద్యార్థినులు

సంజ్ఞలు.. జీవన సోపానాలు

వినలేరు.. మాట్లాడలేరు.. అయితే జీవితంలో ఎదగాలనే ఆకాంక్ష వారిని నడిపిస్తోంది. ఉన్నతంగా చదువుకోవాలనే తపన ముందడుగు వేయిస్తోంది. ఈ క్రమంలోనే టీటీడీ బధిర పాఠశాల.. జూనియర్ కళాశాల అత్యుత్తమ బోధన అందిస్తోంది. క్వాలిఫైడ్ అధ్యాపకులతో ప్రత్యేకంగా శిక్షణ ఇస్తోంది. భావ వ్యక్తీకరణతో సమాచారం అందిపుచ్చుకునేలా తీర్చిదిద్దుతోంది. సంజ్ఞలతో కూడిన విశిష్ట భాషను బధిర విద్యార్థులకు నేర్పిస్తోంది. సాధారణ ఇంటర్ సిలబస్ మాత్రమే అందుబాటులో ఉన్నప్పటికీ విభిన్న పద్ధతుల్లో పిల్లల ప్రతిభకు మెరుగుపెడుతోంది.

- టీటీడీ బధిర విద్యాలయంలో సైన్ లాంగ్వేజ్‌లో బోధన
- ఓరల్.. ఫ్లాష్ కార్డులతో అర్థమయ్యేలా శిక్షణ
- సాధారణ ఇంటర్ విద్యార్థులతోపాటు ఒకే సిలబస్
- ఈ-లెర్నింగ్, ఇంటరాక్టివ్ ప్యానెల్ ఏర్పాటుకు ప్రణాళిక
- వచ్చే ఏడాది నుంచి అందుబాటులోకి ఆంగ్ల మాధ్యమం

తిరుపతి సిటీ : బధిర విద్యార్థుల్లో చురుకుదనానికి లోటు లేదు. శక్తి సామర్థ్యాలలో ఎవరికీ తీసుపోరు. ఆత్మవిశ్వాసమే వారికి ఆసరా..ఎంతో మందికి వారు స్ఫూర్తిదాయకం. సమాచార మార్పిడి, భావ వ్యక్తీకరణకు సంకేత (సైన్ లాంగ్వేజ్) భాషే వారికి ఆధారం. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న బధిర పాఠశాల, జూనియర్ కళాశాలలో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనా పద్ధతులు సాధారణ విద్యార్థుల కంటే భిన్నంగా ఉంటాయి. ఓరల్, ఫ్లాష్ కార్డులు, బోర్డులో రాస్తూ సైన్ లాంగ్వేజ్‌లో బధిర విద్యార్థులకు పాఠ్యాంశాలను స్పెషల్ బీఈడీ చేసిన అధ్యాపకులు బోధిస్తున్నారు.

ప్రత్యేక లాంగ్వేజ్‌తో..

బధిరులకు ప్రత్యేక సిలబస్ అంటూ ఉండదు. సాధారణ ఇంటర్ విద్యార్థులు చదివే పాఠ్యాంశాలే బధిర విద్యార్థులకు సైతం ఉంటాయి. కానీ బోధించే పద్ధతిలో తేడా ఉంటుంది. ప్రధానంగా బధిరులకు సైన్ లాంగ్వేజ్ (సంకేత లేదా సంజ్ఞ భాష)లో బోధించాల్సి ఉంటుంది. ఇందుకోసం స్పెషల్ బీఈడీ ఇన్ హియరింగ్ ఎంపర్‌మెంటల్ కోర్సులో శిక్షణ పొందిన అధ్యాపకులు మాత్రమే అర్హులు. పాఠ్యాంశాన్ని బోధించే క్రమంలో తొలుత విషయాన్ని బోర్డుపై లిఖించాలి. అనంతరం లైన్ బై లైన్ సైగలతో విద్యార్థులకు అర్థమయ్యేలా వివరించాలి. ప్రధానంగా ఓరల్, సైగలు, ఫ్లాష్ కార్డులు (ఫ్ల కార్డులు) చూపిస్తూ విశ్లేషణాత్మకంగా బోధిస్తారు. పాఠ్యాంశం విద్యార్థులకు మరింత లోతుగా అర్థమయ్యేందుకు ఒన్ టూ ఒన్ డిస్కషన్, గ్రూప్ డిస్కషన్ విధానాలను ఉపయోగిస్తారు. స్లో లెర్నర్స్ కోసం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.

బోధన క్లిష్టమైన ప్రక్రియే..!

ప్రపంచంలో ప్రాచుర్యంలో ఉన్న ఏఎస్ఎల్ లాంగ్వేజ్ (అమెరికన్ సైన్ లాంగ్వేజ్)లో బోధన ప్రత్యేకంగా ఉంటుంది. ఇండియన్ సైన్ లాంగ్వేజ్‌లో (ఐఎస్ఎల్) మాత్రమే మన దేశంలోని బధిరులకు బోధన ఉంటుంది. బధిరులకు సంబంధించి రోజూ టీవీ వార్తలు, ప్రొగ్రామ్ మాత్రమే ఏఎస్ఎల్‌లో ప్రసారమవుతాయి. బధిర విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించే అధ్యాపకులకు సైన్ భాషపై పట్టు ఉండాల్సిందే. విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యాంశం అర్థమయ్యే విధంగా బోధించడం అంటే కాస్త క్లిష్టమైన ప్రక్రియే. సైన్ లాంగ్వేజ్ అనేది ప్రాంతాలు, జిల్లాలు, రాష్ట్రాలు, దేశాల మధ్య వ్యత్యాసం ఉంటుంది. రూరల్ ప్రాంతాలలో బధిరులు మాట్లాడే సైన్ భాషకు, పట్టణ ప్రాంతాలలో భాషకు ఎంతో తేడా ఉంటుంది. పాఠశాలలోనూ, కళాశాలలోనూ కొత్తగా అడ్మిషన్లు పొందిన పలు ప్రాంతాల విద్యార్థుల భాషలోనూ, భావవ్యక్తీకరణలోనూ 75శాతం వరకు ఈ తేడా కనిపిస్తుంది. అలాంటి పరిస్థితుల్లో అధ్యాపకులు వారిని ఒకతాటి పైకి తెచ్చేందుకు మరింత శ్రమించాల్సి ఉంటుంది.

పరీక్షలు సాధారణమే..

సాధారణ ఇంటర్ విద్యార్థులకు నిర్వహించే బోర్డు పరీక్షల షెడ్యూలే బధిరులకు సైతం ఉంటుంది. అవే ప్రశ్నాపత్రాలు ఉంటాయి. కానీ ఉత్తీర్ణత మార్కులలో కాస్త వెసులుబాటు కల్పించారు. ప్రతి సబ్జెక్ట్‌లో సాధారణ విద్యార్థులకు 35 మార్కుల ఉత్తీర్ణత ఉండగా, బధిర విద్యార్థులకు 25మార్కులు సాధిస్తే పాస్ అయినట్లు పరిగణిస్తారు. టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ బధిర పాఠశాలలో మాత్రం ఇంటర్‌లో సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు మాత్రమే ఉన్నాయిం. ఇందులో గ్రూప్ సబ్జెక్టులు మూడు, ఓ తెలుగు సబ్జెక్టు మాత్రమే ఉంటుంది. ఇంగ్లిషు సబ్జెక్టుకు ఇంటర్ బోర్డు మినహాయింపు ఇచ్చింది. దీంతో కేవలం నాలుగు సబ్జెక్టుల మాత్రమే ఉంటాయి.

నూతన విద్యా బోధనకు నిధులు

ఎస్వీ బధిర పాఠశాలను 1974లో అలిపిరి శ్రీవారి తొలి పాదం వద్ద స్థాపించారు. 2008లో అదే పాఠశాల ప్రాంగణంలో జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. పాఠశాలలో ఒకటి నుంచి 10 వరకు తరగతులు ఉన్నాయి. 200మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. జూనియర్ కళాశాలలో 172మంది విద్యార్థులు ఉన్నారు. బధిర విద్యాలయం ఏర్పడి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా టీటీడీ అధికారులు త్వరలోనే బధిర విద్యా బోధనలో సమూల మార్పులు తీసుకువచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ-లెర్నింగ్ డిజిటల్ సిస్టమ్, ఇంటరాక్టివ్ ప్యానెల్ బోర్డులను ఏర్పాటు చేసి పాఠ్యాంశాలను నూతన టెక్నాలజీతో బోధించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. దీంతో విద్యార్థులకు అధునాతన టెక్నాలజీ అలవడడంతో పాటు నాణ్యమైన బోధన అందుబాటులోకి రానుంది. అధిక సిలబస్‌ను అతి తక్కువ వ్యవధిలో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించే వెసులుబాటు ఉంటుంది. అలాగే ఇప్పటి వరకు తెలుగు మాధ్యమంలోనే చదువుతున్న విద్యార్థులకు వచ్చే ఏడాది నుంచి ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టనున్నారు. రాష్ట్రంలోనే తొలిసారిగా నూతన బోధనకు తొలి సారి టీటీడీ శ్రీకారం చుట్టనుంది. ఇందుకోసం ఇప్పటికే విద్యాదానం ట్రస్ట్ నుంచి రూ.కోటి మంజూరు చేసినట్లు సమాచారం.



మనోభావాలకు తగ్గట్టు బోధన

బధిరులకు పాఠ్యాంశాలు వివరించడం చాలెంజింగ్‌గా అనిపించినా ఇష్టంగా ఉంటుంది. వారి మనోభావాలకు తగ్గట్టు బోధించాల్సి ఉంటుంది. చాలా మంది పిల్లలు సాధారణ విద్యార్థుల కంటే చురుగ్గా ఉంటారు. బోధించిన అంశాలను వెంటనే గ్రహిస్తారు. కానీ తక్కువ సంఖ్యలో స్లో లెర్నర్స్ ఉంటారు. వారికి ప్రత్యేకంగా బోధించాల్సి ఉంటుంది. టీటీడీ ఎంతో మంది బధిరులకు ఉచిత బోధన, వసతి కల్పించి ఆదుకోవడం శ్రీవారి వరమే. – అధ్యాపకుడు, ఎస్వీ బధిర జూనియర్ కళాశాల, అలిపిరి, తిరుపతి

బోధన అద్భుతం



ఇంటర్ ఫస్ట్ ఇయర్ సీఈసీ చదువుతున్నా. ఇక్కడ బోధించే అధ్యాపకులు మా సొంత సైన్ లాంగ్వేజ్‌ని అర్థం చేసుకుని మనోభావాలకు తగ్గట్టుగా టీచింగ్ చేస్తున్నారు. పూర్తి స్థాయిలో పాఠ్యాంశాలు అర్థమయ్యే వరకు వివరిస్తున్నారు. సబ్జెక్ట్ అర్థం కాకపోతే ప్రత్యేకంగా కూర్చోబెట్టి ఒన్ టూ ఒన్ డిస్కషన్ చేసి చెబుతున్నారు. – వంశీ తేజ, ఇంటర్ విద్యార్థి, తిరుపతి

తొలుత కొంచెం తడబడ్డాం



సైన్ లాంగ్వేజ్ పలు ప్రాంతాలలో పలు విధాలుగా ఉంటుంది. ఇంటర్‌లో అడ్మిషన్ పొందిన తొలి రోజులలో అధ్యాపకులు, స్నేహితులు సంబోధించే సైన్ లాంగ్వేజ్ కాస్త తేడాగా ఉండడంతో తడబడ్డా. అలవాటు పడ్డాక కష్టం అనిపించలేదు. అధ్యాపకులు చెప్పే ప్రతి పాఠ్యాంశం శ్రద్ధగా చూస్తూ పూర్తి స్థాయిలో అర్థం చేసుకోగలిగాం. ప్రస్తుతం అన్ని సబ్జెక్టులు బాగా అవగతమవుతున్నాయి.

– రామరాజు, ఇంటర్ విద్యార్థి, తిరుపతి

కార్యకర్తలకు న్యాయం చేద్దాం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి లీగల్: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు న్యాయ సహాయం అందించాలని పార్టీ లీగల్ సెల్ అడ్వొకేట్లకు మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడిగా భూమన కరుణాకర రెడ్డి నియమితులైన సందర్భంగా పార్టీ లీగల్‌సెల్ న్యాయవాదులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సన్మానించి పుష్పగుచ్ఛాలు అందించారు. భూమన మాట్లాడుతూ యువ న్యాయవాదులకు ఆర్థికంగా చేయూతనందించిన ఏకైక వ్యక్తి మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి అని చెప్పారు. యువ న్యాయవాదులు వృత్తిలో నిలదొక్కుకోవాలని ఉద్దేశంతో ఆర్థిక భరోసా అందజేశారని తెలిపారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు పెడుతోందని ఆరోపించారు. ఈ క్రమంలో పార్టీ శ్రేణులను కాపాడుకోవాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. న్యాయవాదులు అందించే సహకారం పార్టీ బలోపేతానికి తోడ్పడుతుందన్నారు. కార్యకర్తలపై తప్పుడు కేసులు పెడితే లీగల్ సెల్ న్యాయవాదులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్షణ అందించాలని కోరారు. జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకునేందుకు సమష్టిగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ భూమన అభినయ్, వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు దొరబాబు, ఉపాధ్యక్షుడు మోహన్, నాయకులు విజయభాస్కర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, శ్రీనివాసులు, న్యాయవాదులు రవీంద్రనాథ్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రామనాథ్, ప్రభాకర్, యుగంధర్ రెడ్డి, పార్టీ లీగల్ సెల్ పట్టణ అధ్యక్షుడు విజయ్‌కుమార్, రాజశేఖర్, సోమశేఖర్ రెడ్డి, బాలాజీ, మురళి, శ్రీరాములు పాల్గొన్నారు.

వామ్మో..బాంబు బూచీ!

ఆధ్యాత్మిక నగరమైన తిరుపతిని బాంబు బూచీ కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. అధికారులు.. స్థానికులను పరుగులు తీయిస్తోంది. అక్కడ తనిఖీల తర్వాత ఏమీ లేదని తేలాకే ఊపిరి పీల్చుకోవాల్సి వస్తోంది. ఇటీవల వరుసగా చోటు చేసుకుంటున్న బాంబు బెదిరింపుల నేపథ్యంలో యంత్రాంగం మరింత అప్రమత్తమైంది. ఫేక్ మెయిళ్ల ద్వారా భయభ్రాంతులకు గురిచేస్తున్న ఆగంతుకులను గుర్తించేందుకు కట్టుదిట్టంగా నిఘా పెట్టింది.

- ఆధ్యాత్మిక నగరంలో ఆగంతకుల ఫేక్ మెయిళ్లు
- ఆందోళనలో స్థానికులు
- పరుగులు తీస్తున్న పోలీసులు



ఓ హోటల్‌లో డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీ చేస్తున్న పోలీసులు

తిరుపతి క్రైమ్: తిరుపతి నగరంతోపాటు రేణిగుంట విమానాశ్రయంలో బాంబులు పెట్టినట్లు ఇటీవల ఆగంతుకులు వరుసగా ఫేక్ మెయిళ్లు పంపించి హడలెత్తిస్తున్నారు. మొదట ఈనెల 5న విమానాశ్రయానికి ఫేక్ మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులకు దిగారు. ఆ తర్వాత 24వ తేదీన మరోసారి బాంబు బూచీతో బెదరగొట్టారు. అదే రోజు తిరుపతి నగరంలోని మూడు హోటళ్లకూ ఈ మెయిళ్ల ద్వారా బాంబు పెట్టామని పోలీలుసు పరుగులెత్తించారు. అలాగే రెండు రోజుల క్రితం తిరుపతిలోని ఏడెనిమిది హోటళ్లలో బాంబులు పెట్టినట్టు సమాచారం అందించారు. తాజాగా ఆదివారం ఇస్కాన్ టెంపుల్‌లోనూ బాంబులు పెట్టినట్టు మెయిళ్లు వెళ్లాయి. దీంతో పోలీసులు అధికారులు జల్లెడ పట్టారు. ఎలాంటి బాంబులు లేకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. తిరుచానూరు, అలిపిరి, ఈస్ట్ పోలీసులు వారి వారి పరిధిలోని స్టార్ హోటళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. డాగ్స్, బాంబు స్క్వాడ్‌లతో ఇస్కాన్ టెంపుల్‌లో గాలింపు చేపట్టారు. ఎస్పీ సుబ్బరాయుడు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇలాంటి ఫేక్ మెయిల్స్ వస్తున్నాయన్నారు. వీటిపై కేసులు నమోదు చేశామని వెల్లడించారు. నిందితులను గుర్తించి అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు.

ఎవరి నుంచి ఈ మెయిల్స్?

తిరుపతిలో ఇప్పటికి మూడుసార్లు బాంబు బెదిరింపు మెయిల్స్ వచ్చాయి. ఆదివారం జాఫర్ సాధిక్ అనే పేరుతో ఈ మెయిల్ వచ్చింది. అయితే ఇది తీవ్రవాద సంస్థల పనా.. లేదా ఆకతాయిల చేష్టలా అర్థం కాక పోలీసులు తలలు పట్టుకుంటున్నారు. వారం రోజుల నుంచి హోటళ్లు, ఆలయాలను జల్లెడ పడుతున్నారు.

ఆగదే మెట్రో!

- సీట్లు ఖాళీగా ఉన్నా ప్యాసింజర్లను ఎక్కించుకోని మెట్రో బస్సులు
- డ్రైవర్ల వద్ద టిమ్ మిషన్లున్నా ప్రయోజనం శూన్యం
- శ్రీకాళహస్తి– తిరుపతి నాన్‌స్టాప్ సర్వీసులపై ప్రయాణికుల అసంతృప్తి
- ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి
- పట్టించుకోని ప్రజా రవాణాశాఖ అధికారులు

తిరుపతి అర్బన్ : శ్రీకాళహస్తి మెట్రో సర్వీసులపై ప్రయాణికులు, భక్తులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వన్‌మన్ సర్వీసు కావడం.. టిమ్ ఉన్నా డ్రైవర్ నిర్లక్ష్యంగా ఆపకుండా వెళ్లిపోతుండడంతో నిత్యం తిప్పలు ఎదుర్కోవాల్సి వస్తోందని పలువురు ఆరోపిస్తున్నారు. అసలు ఈ మెట్రో కథేంటంటే. శ్రీకాళహస్తి డిపోలో మెట్రో సర్వీసులు 30 వరకు ఉన్నాయి. ఇవి తిరుపతి శ్రీహరి బస్టాండ్‌లోని 9, 10 ప్లాట్‌ఫామ్‌లలో ఆగుతుంటాయి. అక్కడున్న కండక్టర్లు మెట్రో ఎక్కే ప్రయాణికులకు టిక్కెట్లు కొట్టి అక్కడే దిగిపోతున్నారు. బస్టాండ్‌కు పడమర, దక్షిణం, తూర్పు వైపు ప్రాంతాల్లో ఉంటున్న భక్తులు, ప్రయాణికులు ఆపినప్పటికీ కండక్టర్ లేడంటూ డ్రైవర్లు చేతులూపుతూ వెళ్లిపోతున్నారు. ఇక తిరుచానూరు నుంచి వచ్చే భక్తులు శ్రీకాళహస్తికి వెళ్లడానికి రామానుజ సర్కిల్ వద్ద వేచి ఉన్నా నిరాశే మిగులుతోంది.

నిర్లక్ష్యమా..అవగాహనా రాహిత్యమా?

సాధారణంగా మెట్రో డ్రైవర్ల వద్ద టిమ్ మిషన్ ఉంటుంది. మధ్యలో ఎవరైనా ఆపితే ఎక్కించుకోవాల్సి ఉంది. కానీ డ్రైవర్లు తమకేమీ పట్టనట్టు నిర్లక్ష్యంగా వెళ్లిపోతున్నారు. శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వచ్చేటప్పుడు కూడా ఇదే పరిస్థితి. రైల్వేస్టేషన్, హౌసింగ్ బోర్డు, , మిట్టకండ్రిగ వద్ద వేచి ఉండే ప్రయాణికులను ఎక్కించుకోకుండానే వెళ్లిపోతుంటారు. ఇక తిరుపతి నుంచి శ్రీకాళహస్తి వెళ్లేప్పుడు రేణిగుంట, రేణిగుంట సర్కిల్, ఏర్పేడు వద్ద చాలా మంది ప్రయాణికులు బస్సులకు అడ్డుపడుతున్నా ఆపే ప్రసక్తే లేదంటూ దూసుకెళుతున్నారు.



రాత్రి పూట ఖాళీ బస్సులే

సాధారణంగా శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి రోజుకు ఒక మెట్రో సర్వీసు ఆరు ట్రిప్పులు వేయాల్సి ఉంది. కానీ నాలుగైదు ట్రిప్పులకే రాత్రి అయిపోతోంది. ఆ తర్వాత డ్రైవర్ల అవసరాల మేరకు మిగిలిన రెండు ట్రిప్పులు వేస్తున్నారు. ప్రయాణికులు లేకపోయినా ఖాళీ బస్సులే తిప్పేస్తున్నారు. ఇక రాత్రిపూట పలువురు భక్తులు నిత్యం రైళ్లలో వచ్చి రేణిగుంటలో దిగి శ్రీకాళహస్తికి వెళుతుంటారు. రేణిగుంట సర్కిల్ వద్ద అనేక మంది పడిగాపులు కాస్తుంటారు. కళ్లెదుటే శ్రీకాళహస్తికి మెట్రో సర్వీసులు వెళుతున్నా ఎక్కలేని పరిస్థితి. డ్రైవర్లు కనీసం సమాధానం కూడా చెప్పకుండా వెళ్లిపోతుంటారని పలువురు ఆరోపిస్తున్నారు. తప్పని పరిస్థితుల్లో ఆటోలు.. ఇతర ప్రయివేటు వాహనాల్లో శ్రీకాళహస్తికి చేరుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రాబడి పట్టదా?

మొదలే టెంపుల్ సిటీగా పేరున్న శ్రీకాళహస్తికి నిత్యం భక్తులతోపాటు, ఇతర ప్రాంతాల వ్యాపారులు రాకపోకలు సాగిస్తుంటారు. కానీ ఆర్డినరీ సర్వీసులు పోను మిగిలిన బస్సులన్నీ వన్‌మన్ సర్వీసు కావడంతో బస్టాండ్‌లో ఉన్న ప్రయాణికుల వరకే పరిమితమవుతున్నాయి. కొందరు కండక్టర్లు ఏపీ సీడ్స్ సర్కిల్ వరకు, మరి కొందరు హౌసింగ్ బోర్డు కాలనీ వరకు వచ్చి దిగేస్తుంటారు. వీరు మిట్టకండ్రిగ వరకు వస్తే మరింత మంది ప్రయాణికులకు అనుకూలంగా ఉండే అవకాశం ఉందని పలువురు కోరుతున్నారు. ఆదాయ మార్గాలు అన్వేషించాల్సిన ఆర్టీసీ అధికారులు ఇలా నిర్లక్ష్యంగా సర్వీసులు తిప్పడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా కళ్లు తెరుస్తారో.. లేక నిర్లక్ష్యంగా వదిలేస్తారో చూడాల్సి ఉంది.

ఇబ్బంది లేకుండా చర్యలు



ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపడతాం. కండక్టర్లు బస్టాండ్‌కే పరిమితం కాకుండా రామానుజ సర్కిల్ వరకు కండక్టర్లు వెళ్లేలా ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. డ్రైవర్ల వద్ద టిమ్ మిషన్లు ఉన్నాయి. వారు కూడా టికెట్లు కొట్టి ప్రయాణికులకు ఇచ్చేలా చర్యలు తీసుకుంటాం. శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వచ్చేటప్పుడు కండక్టరు హౌసింగ్ బోర్డ్ వరకు తప్పనిసరిగా రావాలి. – బాలాజీ, తిరుపతి, శ్రీకాళహస్తి డిపో మేనేజర్

నేడు కలెక్టరేట్‌లో 'గ్రీవెన్స్'

- ఇప్పటికీ కనీస వసతుల కరువు
- తీవ్రంగా ఇబ్బందిపడుతున్న అర్జీదారులు



టోకెన్లు తీసుకోవడానికి గుమికూడిన అర్జీదారులు(ఫైల్)

తిరుపతి అర్బన్ : ప్రజా సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. అయితే గత ఐదు నెలలుగా అర్జీదారులకు వసతులు కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. కనీసం కుర్చీలు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వినతుల అందించేందుకు వచ్చే వారు గంటల తరబడి నిలబడాల్సి వస్తోంది. ముఖ్యంగా వృద్ధుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటోంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తిరుపతి సెంట్రల్ బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు ప్రతి సోమవారం ప్రత్యేక బస్సులు నడిపేవారు. అలాగే కలెక్టరేట్‌లో అర్జీలు రాసేందుకు ముగ్గురు వీఆర్‌ఓలను అందుబాటులో ఉంచేవారు. అదే ఇప్పుడు వినతులు రాసుకునేందుకు పలువురు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. క్యూ పద్ధతి లేకపోవడంతో గుంపులు గుంపులుగా టోకెన్ల కోసం ఎగబడాల్సిన దుస్థితి దాపురించింది. అలాగే దాహార్తిని తీర్చుకునేందుకు నీటి వసతి లేకపోవడంతో అర్జీదారులు అలమటిస్తున్నారు. అలాగే బస్టాండ్ నుంచి కలెక్టరేట్‌కు వచ్చేందుకు గతంలో మాదిరిగా ప్రత్యేక సర్వీసులు లేకపోవడంతో రూ.200 నుంచి రూ.250 వరకు చెల్లించి ఆటోల్లో రాకపోకలు సాగిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కనీస సౌకర్యాలు కల్పించాలని అర్జీదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

చంద్రగిరి: తిరుపతి–చంద్రగిరి రైల్వే స్టేషన్ల మధ్యలో శనివారం రాత్రి రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే ఎస్ఐ ప్రవీణ్ కుమార్ అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడికి సుమారు 45 ఏళ్లు ఉంటాయని, నీలం రంగు చొక్కా, రెండు రకాల షార్టులు ధరించినట్లు తెలిపారు. మృతుడి వద్ద ఎటువంటి ఆధారాలు లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 940416642, 9494228854 నంబర్లలో సంప్రదించాలన్నారు.

అనుమానాస్పదస్థితిలో ఒకరు..


విజయసాగర్ మృతదేహం

నాయుడుపేటటౌన్ : పట్టణంలోని స్వర్ణముఖి నది ఒడ్డున శివాలయం సమీపంలో ఆదివారం దోనేపూడి విజయ సాగర్ (34) అనే వ్యక్తి అను మానస్పదంగా మృతి చెందాడు. స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వివరాలు. పట్టణంలోని లోతువానిగుంట కాలనీకి చెందిన విజయ సాగర్ టైల్స్ నిర్మాణ పనులకు వెళుతుంటాడు. అతడికి భార్య లత, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మద్యానికి బానిసగా మారి కూలి డబ్బులు ఇంట్లో ఇవ్వకుండా తాగేసేవాడు. దీనిపై అతడి భార్య పోలీసులకు సైతం ఫిర్యాదు చేసి ఉంది. ఈ క్రమంలో ఆదివారం ఉదయం విజయసాగర్ అతిగా మద్యం తాగి తిరుగుతుండడంతో స్థానికులు తీసుకెళ్లి శివాలయం వద్ద వదిలిపెట్టారు. కొద్దిసేపటికే అతడు మరణించాడు. మద్యం అతిగా తాగడం వల్లే మృతి చెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సత్యవేడు సర్కిల్‌లో వసూల్ రాజా

- ఆర్థిక మంత్రి అండగా ఉన్నారంటూ ఓ ఎస్ఐ దందా
- తమిళనాడు కంకర లారీలే లక్ష్యం
- అడిగింది ఇస్తేనే అధిక టన్నేజీకి అనుమతి
- ఒక్కో వాహనానికి రూ.14వేలు వసూలు
- ప్రతి నెలా సుమారు రూ.20లక్షల ముడుపులు
- వచ్చిన మొత్తంలో ఉన్నతాధికారులకు సైతం వాటాలు

రెండు నక్షత్రాల స్థాయి కలిగిన పోలీస్ అధికారి ఇష్టారాజ్యంగా చెలరేగిపోతున్నారు. తన పరిధిని దాటి పక్క మండలంలో సైతం వసూళ్ల పర్వానికి తెరతీశారు. తన వెనుక ఆర్థిక మంత్రి ఉన్నారంటూ సహోద్యోగులపై పెత్తనం చెలాయిస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడుకు చెందిన కంకర లారీల యజమానుల ముక్కు పిండి మామూళ్లు గుంజుకుంటున్నారు. అడిగినంత ముట్టజెప్పకుంటే వాహనాలను సీజ్ చేస్తామని బెదిరిస్తున్నారు. ఇదేటని ప్రశ్నించిన వారిపై జులుం ప్రదర్శిస్తున్నారు. అక్రమ సంపాదనలో ఉన్నతాధికారులకు సైతం వాటాలు చెల్లిస్తున్నామని బహిరంగంగానే వెల్లడిస్తున్నారు.


సత్యవేడు మీదుగా అధిక టన్నేజీతో వెళ్తున్న కంకర లారీలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: ఆంధ్ర–తమిళనాడు సరిహద్దు ప్రాంతమైన సత్యవేడు కేంద్రంగా పలు వ్యాపారాలు, వాహనాల ద్వారా రవాణా జరుగుతుంటుంది. ఇదే అదునుగా భావించిన సత్యవేడు సర్కిల్ పోలీసులు తమ అక్రమార్జనకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. దీంతో ఒక్కో అక్రమ వ్యాపారానికి ఒక్కో రేటు కుదుర్చుకుని నెలసరి మామూళ్ల రూపంలో దోపిడీ చేస్తున్నారు. ఇందులో ప్రధానంగా సత్యవేడు, బీఎన్‌కండ్రిగ, తొట్టంబేడు మండలాల్లోని కంకర క్వారీల నుండి తమిళనాడుకు అత్యధిక టన్నేజీతో రవాణా అయ్యే టిప్పర్ లారీలనే టార్గెట్ చేస్తూ తమ పబ్బం గడుపుకుంటున్నారు. నెలసరి రూ.లక్షల్లో జేబులు నింపుకుంటూ కోట్లకు పడగలెత్తున్నారు. మొత్తం వసూళ్ల పర్వానికి ఇటీవల కడప తాలూకా పోలీస్ స్టేషను నుంచి బదిలీపై వచ్చిన ఓ ఎస్ఐ నాయకత్వం వహిస్తున్నారు. పోగేసిన సొమ్మును ప్రతి నెలా అందరికీ వాటాలు పంచుతున్నారు.

టార్గెట్ టిప్పర్ లారీలే !

సత్యవేడు మండలం చమర్తకండ్రిగ ప్రాంతంలో ఉన్న కంకర క్వారీల నుంచి తమిళనాడుకు తరలించే టిప్పర్ లారీలను ప్రధానంగా ఎంచుకున్నారు. ఇక్కడ నుండి రోజువారీ 120 నుంచి 150 లారీలు తమిళనాడుకు కంకర తరలిస్తాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు ఒక్కో లారీ 35 టన్నుల వరకు లోడ్ వేసుకోచ్చు. అయితే లారీ యజమానులు అధిక ఆదాయం కోసం లారీ ట్రక్కును కొంచెం ఎత్తుగా సిద్ధం చేసుకుని 45 నుంచి 50 టన్నుల వరకు లోడ్ చేసేస్తున్నారు. ఇలా అధిక టన్నేజీతో వెళ్లే ప్రతి లారీ నుంచి సత్యవేడు పోలీస్ సర్కిల్‌కు రూ. 14వేలు నెలసరి మామూళ్లు చెల్లించాల్సిందే.వచ్చిన మొత్తంలో వరదయ్యపాళెం, సత్యవేడు పోలీస్ స్టేషన్, సర్కిల్‌కు మూడు వాటాలుగా భాగ పరిష్కారం చేసుకుంటారు. ప్రధానంగా త్రీస్టార్ అధికారికి రూ.6వేలు, టూస్టార్ అధికారులు ఒక్కొక్కరికీ రూ.4వేల చొప్పున ఒక్కో లారీకి వాటాలు వెళతాయి. ముడుపులు చెల్లించని లారీలను ఎప్పటికప్పుడు

చేతులు మారుతున్న రూ. 20 లక్షలు

తమిళనాడుకు తరలించే కంకర లారీల నుంచే నెలకు రూ.20 లక్షలకు పైగా సత్యవేడు పోలీస్ సర్కిల్ అధికారులకు ముడుపులు అందుతున్నాయి. ఈ సొమ్మును అధికారులు వారివారి స్థాయిని బట్టి వాటాలు పంచుకుంటున్నారు. అలాగే ధాన్యం, ఇసుక, గ్రావెల్ తరలించే వారి నుంచి కూడా పెద్ద మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఇంత భారీ స్థాయిలో అక్రమ సంపాదన ఉన్న కారణంగానే సత్యవేడు సర్కిల్ త్రీస్టార్ అధికారికి, వరదయ్యపాళెం, సత్యవేడు టూస్టార్ అధికారుల పోస్టింగ్‌లకు ఎక్కడలేని డిమాండ్ ఉంది. అందుకే రూ.లక్షల్లో ముడుపులు ఇచ్చి ఇక్కడ పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు.

తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగలో ఇదే తంతు

బీఎన్‌కండ్రిగ మండలంలోని నెలవాయి సమీపంలో ఉన్న క్వారీలు, తొట్టంబేడు మండలం, తంగేళ్లపాళెం ప్రాంతంలో ఉన్న క్వారీల నుంచి తమిళనాడుకు కంకర లోడింగ్‌లతో టిప్పర్ లారీలు వెళుతుంటాయి. ఇక్కడి నుంచి కంకర తరలించే లారీ యజమానులు సైతం బీఎన్‌కండ్రిగ సర్కిల్ త్రీస్టార్ అధికారికి, ఆ మార్గంలోని పోలీస్ స్టేషన్ టూస్టార్ అధికారికి నెలసరి ముడుపులు చెల్లిస్తేనే వాహనాలకు గ్రీన్‌సిగ్నల్ దొరుకుతోంది.

వాహన తనిఖీ పేరిట పక్కన పెడుతూ వారిపై కేసులు బనాయిస్తారు.

ఒకటిన్నర కిలోమీటర్ల పరిధిలోనే..

సత్యవేడు మండలం చమర్తకండ్రిగలో కంకర క్వారీలు ఉన్నాయి. అయితే అక్కడ నుంచి చిన్న పాండూరు మీదుగా సత్యవేడుకు వెళ్లి తమిళనాడుకు వెళ్లాల్సి ఉంది. మార్గమధ్యంలో వెంకటాపురం నుంచి చిన్న పాండూరు మధ్యలో ఒకటిన్నర కిలోమీటర్ల వరకు వరదయ్యపాళెం మండలానికి సంబంధించిన ప్రాంతం ఉంది. ఆ పరిధిలోనే ముడుపుల వసూలు ముమ్మరంగా సాగుతోంది.

ఇబ్బందిపడుతున్న లారీ యజమానులు

సత్యవేడు సర్కిల్ పరిధిలో పోలీసుల ఒత్తిడికి లారీ యజమానులు విలవిలలాడుతున్నారు. వచ్చే ఆర్డర్ల మేరకు నెలంతా లారీని తిప్పినా పోలీసులకు ఇచ్చేంత ముడుపులు మొత్తం కూడా రావడం లేదని ఆవేదన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వంలో పోలీసులు బరితెగించి మరీ అక్రమ దందాకు పాల్పడుతున్నారని మండిపడుతున్నారు.

వాకాడులో 12 అడుగుల నాగు



వాకాడు : స్థానిక ఆర్టీసీ డిపో ఎదురుగా లేఅవుట్‌లో ఆదివారం 12 అడుగుల నాగుపాము కనిపించడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. అయితే అలికిడి వినగానే చిరైత్తి పైన పడిపోయే నాగుపాము కదలకుండా అలాగే ఉండడంపై ఆశ్చర్యానికి లోనయ్యారు. అంత పెద్ద నాగుపామును ఇప్పటి వరకు చూడలేదని, పడగ విప్పిందే కానీ కదలలేని స్థితిలో ఉందని వెల్లడిస్తున్నారు.

లాటరీ టికెట్ల విక్రేత అరెస్ట్

పుంగనూరు: పట్టణంలోని కొత్తపేటలో చట్టవిరుద్ధంగా లాటరీ టికెట్లు విక్రయిస్తున్న ఖాదర్‌బాషాను ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఖాదర్‌బాషాను పట్టుకుని అతని వద్ద నుంచి 42 లాటరీ టికెట్లు, రూ.2,500 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఆయన చెప్పారు. లాటరీ టికెట్ల వ్యాపారంపై పోలీసులు మఫ్టీలో గస్తీ తిరుగుతున్నట్లు సీఐ తెలిపారు.

లోకకల్యాణార్థమే శ్రీరామ యంత్ర రథయాత్ర


పూజ అనంతరం మాట్లాడుతున్న కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి

- అయోధ్యలో 45 రోజుల పాటు మహాయగం

తిరుపతి కల్చరల్: సనాతన ధర్మం, ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ తిరుమల శ్రీవారి పాదాల చెంత నుంచి శ్రీరామ జన్మస్థలమైన అయోధ్యకు శ్రీరామ యంత్ర రథయాత్ర చేపడుతున్నట్లు కంచి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి తెలిపారు. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం ట్రస్ట్, శ్రీకంచి కామకోటి పీఠం, చిన్మయి సేవా ట్రస్టుల సంయుక్త ఆధ్వర్యంలో ఈ యాత్ర సాగుతుందన్నారు. ఈ మేరకు ఇస్కాన్ రోడ్డులోని కంచి మఠంలో ఏర్పాటు చేసిన శ్రీరామ యంత్రంతో పాటు కంచి కామాక్షి అమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో కంచి పఠాధిపతి విజయేంద్ర సరస్వతి పాల్గొని పూజలు నిర్వహించి అనుగ్రహ భాషణ చేశారు. శ్రీరామ యంత్ర యాత్రలో భాగంగా అయోధ్యలో నవంబర్ 18 నుంచి జనవరి ఒకటవ తేదీ వరకు 45 రోజుల పాటు మహా నారాయణ దివ్యరుద్ర సహిత శత సహస్ర చండీ విశ్వ శాంతి మహాయాగం చేపడుతామన్నారు. సుమారు 1,200 మందికిపైగా వేద పండితులచేత ఈ మహాయాగం అత్యంత భక్తి ప్రపత్తులతో నిర్వహిస్తారని తెలిపారు. అయోధ్య క్షేత్రంలో భక్తుల దర్శనార్థం ప్రతిష్ఠించేందుకు ప్రత్యేకంగా శ్రీరామ మంత్ర పత్రాలను రూపొందించినట్టు వెల్లడించారు. తిరుమల శ్రీవారి ఆలయ తరహాలో అయోధ్యలో సైతం సనాతన ధర్మం మరింత ప్రచారం సాగాలని కాంక్షిస్తూ శ్రీచక్రం తరహాలో ఈ శ్రీరామ మంత్ర పత్రాలను అయోధ్య ఆలయంలో ప్రతిష్ఠించనున్నట్టు పేర్కొన్నారు. శ్రీరామ మంత్ర రథయాత్ర తిరుపతి నుంచి బయలు దేరి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్రం మీదుగా సుమారు 1,800 కిలోమీటర్లు సాగుతూ అయోధ్యకు చేరుకుంటుందన్నారు. ఈ యాత్రలో భక్తులందరూ పాల్గొని శ్రీరామచంద్రుడి కృపా కటాక్షాలకు పాత్రులు కావాలని కోరారు. అనంతరం కంచి పీఠాధిపతి శ్రీరామ మంత్ర రథానికి పూజలు చేసి జెండా ఊపి ప్రారంభించారు.

బతుకు 'వేట'లో గిరిజనం


సూళ్లూరుపేట-శ్రీహరికోట మార్గంలో బ్రిడ్జిపై నుంచి వల విసురుతున్న గిరిజనుడు

సూళ్లూరుపేట : ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పులికాట్‌కు పాక్షికంగా నీరు చేరింది. దీంతో తీర ప్రాంత గ్రామాల్లోని గిరిజన జాలర్లకు చేతి నిండా పనిదొరికింది. దీపావళి పండుగను సంతోషంగా జరుపుకునే అవకాశం దక్కింది. ఈ క్రమంలో జాలర్లు చేపల వేటలో నిమగ్నమయ్యారు. పులికాట్ వెంబడి తడ మండలం నుంచి చిట్టమూరు మండలం వరకు గిరిజనులు వలలు సిద్ధం చేసుకుని బతుకు పోరు ప్రారంభించారు. సంప్రదాయ మత్స్యకారులు పడవల్లో పెద్ద వలలతో వేటకు దిగితే, గిరిజన జాలర్లు చిన్నపాటి వలతో తమ అదృష్టం పరీక్షించుకుంటున్నారు. సూళ్లూరుపేట-శ్రీహరికోట మార్గంలో వున్న చిన్న బ్రిడ్జిలపై నిలబడి వల విసిరి మరీ వేట సాగిస్తున్నారు. దొరికిన మత్స్య సంపదను మార్కెట్‌లో విక్రయించుకుని సంతోషంగా ఇంటి ముఖం పడుతున్నారు.


పులికాట్‌లో వల విసురుతున్న జాలరి

అదనపు 'గంట'.. బస్సులదే తంటా!

పేద విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం ఆడుకుంటోంది. పల్లెప్రాంతాల నుంచి వస్తున్న వారిని చిన్నచూపు చూస్తోంది. జూనియర్ కళాశాలల్లో తరగతుల వేళలను ఏకపక్షంగా గంట వరకు పెంచేసింది. దూరాభారం నుంచి వస్తున్న పిల్లలు తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందిపడే దుస్థితిని తీసుకువచ్చింది. సర్కారు తీరుతో ముఖ్యంగా బాలికలు నానా అవస్థలు పడుతున్నారు. కాలేజీ నుంచి స్వగ్రామానికి వెళ్లేందుకు బస్సులు దొరకక ఆందోళనకు గురవుతున్నారు. చీకటి పడే సమయంలో ఆటోల్లో ప్రయాణించడం శ్రేయస్కరం కాదని ఆవేదన చెందుతున్నారు. పాత పద్ధతిలోనే క్లాసులు ముగించాలని కోరుతున్నారు.

- జూనియర్ కాలేజీల్లో సాయంత్రం 5వరకు తరగతులు
- సమయం మార్పుతో విద్యార్థుల ఇక్కట్లు
- ఇంటికి చేరేందుకు బాలికల అవస్థలు
- ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు



గూడూరు లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల

జిల్లా సమాచారం

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు	:	23
ఫస్టియర్ విద్యార్థులు	:	4,897
సెకండియర్ విద్యార్థులు	:	4,589
మొత్తం బాలికలు	:	5,689
సమయం పెంపుతో ఇబ్బందిపడుతున్నవారు	:	4,568

చిత్తూరు కలెక్టరేట్ : ఇంటర్మీడియట్ వ్యవస్థలో కూటమి ప్రభుత్వం సమస్యలు సృష్టించింది. విద్యాసంవత్సరం మధ్యలో జూనియర్ కళాశాలల వేళలను మారుస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. క్షేత్రస్థాయిలో ఇబ్బందులు తెలుసుకోకుండానే ఆదేశాలు ఇచ్చేసింది. దీంతో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద విద్యార్థులు అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఇళ్లకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఎక్కువగా పేద, మధ్య తరగతి విద్యార్థులే చదువుతున్నారు. జిల్లాలో చాలా వరకు మండల కేంద్రాల్లోనే ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. మండల కేంద్రాల నుంచి బస్సు సౌకర్యం లేని గ్రామాలు చాలా ఉన్నాయి. కొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యం ఉన్నా సమయానికి రాకపోవడం, ఉదయం వస్తే సాయంత్రం రాకపోవడం వంటి సమస్యలూ ఉన్నాయి.

ఇంత అక్కసెందుకో..?

పేద పిల్లలకు మేలు చేయాల్సిన కూటమి సర్కారు అక్కసు చూపడం సబబు కాదని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులు, లెక్చరర్ల అభిప్రాయాలను తెలుసుకోకుండా ఏకపక్షంగా కళాశాలల సమయం మార్చడం సరైన పద్ధతి కాదంటున్నాయి. సాయంత్రం 5 గంటల వరకు కళాశాలలు నిర్వహించాలనే ఉత్తర్వులను ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోని లెక్చరర్లు సైతం విమర్శిస్తున్నారు. సాయంత్రం ఒక గంట పాటు నిర్వహించే ప్రత్యేక తరగతులను ఉదయం సమయంలో నిర్వహించుకోవచ్చని సూచనలిస్తున్నారు. సాయంత్రం 5 వరకు తరగతులు నిర్వహించడం వల్ల రవాణా సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడిస్తున్నారు.

కార్పొరేట్‌లో కాలేజీ బస్సులు

జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వం ఆదేశించకపోయినప్పటికీ ఎక్కువ సమయం అదనంగా తరగతులు నిర్వహిస్తున్నారు. ఆ కళాశాలల్లో చదివే విద్యార్థులకు రాత్రి 8 గంటల వరకు కూడా ఐఐటీ, జేఈఈ, ఎంసెట్ పేర్లతో ప్రత్యేక క్లాసులు బోధిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు అధిక శాతం మంది కాలేజీ బస్సుల్లో ఇళ్లకు జాగ్రత్తగా చేరుకుంటారు. అయితే ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులకు ప్రత్యేక బస్సుల సౌకర్యం లేకపోవడం సమస్యలు ఎదురవుతున్నాయి.

పునరాలోంచించాలి



సమయం మార్పు అంశంపై ప్రభుత్వం పునరాలోచించాలి. సాయంత్రం 5 గంటలకు కళాశాల వదిలితే ఆ సమయంలో ఇంటికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది. బస్సు సౌకర్యం లేక పోవడం వల్ల ఆటోలో వెళ్లాలి. ఆటోలు కూడా లేకపోతే సైకిల్‌పై వెళ్లాలి. ఆ సమయంలో ఊరికి వెళ్లాలంటే భయంగా ఉంటుంది.సాయంత్రం 4 గంటలకు కళాశాల వదిలేప్పుడు ఎలాంటి సమస్యలు ఉండేవి కావు. ఈ మధ్యలో 5 గంటల వరకు తరగతులు కొనసాగించడం వల్ల అవస్థలు పడాల్సి వస్తోంది.

- వందన, ఇంటర్ విద్యార్థిని, ఎర్రావారిపాళెం

ఇబ్బందికరంగా ఉంది



నాగలాపురంలోని జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుకుంటున్నా. మా ఊరి నుంచి కళాశాలకు రావాలంటే 15 కిలోమీటర్లు ప్రయాణించాలి. సాయంత్రం కళాశాల వదిలే సరికే 5 గంటలవుతుంది. ఆ సమయంలో మా గ్రామానికి వెళ్లాలంటే ఎలాంటి బస్సు సౌకర్యం లేదు. ఆటోల కోసం వేచి చూడాల్సిందే. ఒకొక్క సారి ఆటోలో చాలా రద్దీగా ఉండడం వల్ల వారు ఆపకుండా వెళ్లిపోతారు. ఇంతకు ముందు సాయంత్రం 4 గంటలకే కాలేజీ వదిలే వారు. ఆ సమయంలో అయితే సులువుగా ఇంటికి వెళ్లిపోవచ్చు. ఇప్పుడు సమయం పొడిగించడం ఇబ్బందికరంగా ఉంది. **- చందు, ఇంటర్ విద్యార్థిని, రాజులకండ్రిగ**

సమస్యలు అర్థం చేసుకోవాలి.....



గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రభుత్వ కళాశాలల్లో చదువుకుంటున్న మా సమస్యలను అధికారులు అర్థం చేసుకోవాలి. కళాశాల సమయం పెంపు వల్ల ఇబ్బందులు పడుతున్నాం. గతంలో కళాశాల సమయం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకే ఉండేది. ఇప్పుడు ప్రభుత్వం 5 గంటల వరకు పెంచడంతో బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నాం. నాయుడుపేట నుంచి పెరికిలింపాటికండ్రిగ గ్రామానికి చేరే లోపు రాత్రి అయిపోతోంది. ప్రభుత్వం ఇప్పటికైనా నిర్ణయం మార్చుకోవాలి.

- సాగర్, ఇంటర్ విద్యార్థి, నాయుడుపేట మండలం

భయంగా ఉంటోంది



కళాశాలల సమయం మార్పు చేయడంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. నా కుమార్తె పావని వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకుంటోంది. మా గ్రామం నుంచి కళాశాలకు 14 కిలోమీటర్ల దూరం ఉంటుంది. సరిగ్గా బస్సు సౌకర్యం కూడా ఉండదు. నెల ముందు వరకు త్వరగా ఇంటికి వచ్చేసేది. ఇప్పుడేమో ఇంటి కొచ్చే సరికి రాత్రి 8 గంటలవుతోంది. అప్పటి వరకు మా పాప ఎప్పుడు వస్తుందా అని భయంతో ఎదురు చూస్తూ ఉంటాము. కళాశాలల వేళలను కూటమి ప్రభుత్వం మార్చడం సరికాదు. **- ఈశ్వరమ్మ, విద్యార్థిని తల్లి, వెంకటగిరి మండలం**